

# వివాహానంతరం

బి. సాహితి

"పోస్ట్"

ఉత్తరం తీసుకున్నాను. శ్యామల దగ్గర్నుంచి. ఎన్నాళ్ళకి! సంతోషంగా, ఆత్రుతగా కవరు చింపాను. శ్యామల ఎవరంటారా? చెప్తా.

"డియర్ సులో

చాలా రోజులకి వుత్తరం రాస్తున్నాను కదూ? ఉత్తరాలు తరుచు రాయకపోయినా మన స్నేహం మాత్రం నేను మర్చిపోలేను. నువ్వూ మరువలేవని నాకు తెలుసు. మీ మామయ్య జగన్నాథంగారికి ఈ వూరు బదిలీ అయిందని నీకు తెలుసుగా. మా ఇంటి ప్రక్కనే వాళ్ళు—ఇల్లు అద్దెకు తీసుకున్నారు. అత్త, మామయ్యలని చూసినట్లూ వుంటుంది; నాతోనూ నాలుగు రోజులు గడపవచ్చు సరదాగా. వస్తావుకదూ! నీకు సెలవులు వస్తున్నాయిగా! తప్పక రా! నిన్ను చూడాలని వుంది. కబుర్లన్నీ నీ సమక్షంలో. ప్రస్తుతానికింతే. నీ కోసం ఎదురు చూస్తూ వుంటాను....

నీ

శ్యామల"

ఇది నా స్నేహితురాలు శ్యామల రాసిన ఉత్తరం. కాలేజీ చదువు దాకా మేం కలిసే చదివాం. అది బి. ఎ. పూర్తి చేసి, పెళ్ళి చేసుకుంటే, నేను ఎమ్. ఎ. చదివి ఉద్యోగంలో ప్రవేశించాను.

శ్యామలకి తెలుగు సాహిత్యం పట్ల అభిరుచి ఎక్కువ. సొంపైన రస గుళికల్లాంటి తెలుగు పద్యాలు మా మేస్టారు ఇంపుగా చదువుతూ, అర్థం వివరిస్తుంటే పొంగిపోతూ వినేది. ఆసక్తి కొద్దీ ప్రత్యేకంగా కొన్ని ప్రబంధాలు చెప్పించుకుంది. చిన్న చిన్న వాదనలు కూడా జరిగేవి మా మధ్య.

నేనంటూ వుండేదాన్ని. "శృంగారానికి అంత ప్రాముఖ్యం ఇవ్వడం నాకు నచ్చదు సుమా. ఐనా మరీ ఆ సుకుమారులు చంద్రుడి మొదలు గాలి వరకు తిట్టిపొయ్యడం! ప్రియుడి జాప్యం భరించడం ప్రాణాంతకం ప్రియురాలికి. ఆతగాడికి ఆమె అలక తీర్చడం ఓ గొప్ప వరం. ఈ పార్సంతా నడిస్తేనేగాని శృంగార మవదా ఏమిటి?"

ఉస్సు మనేది శ్యామల. "నీ మొహం. దేనికైనా రస హృదయం కావాలే. అందులోని అందం నీకేం తెలుసు?"

వెంటనే కలలోలా మాట్లాడేది.

"వెండి వెన్నెలలో, పూల సందడిలో, చల్లని పిల్ల గాలులు మృదువుగా పలకరిస్తుంటే, మనసు మెచ్చిన ప్రియునితో షికారు వెళ్ళడం ఎంత ఆహ్లాదంగా వుంటుంది! పచ్చని బయళ్ళలో ప్రకృతి మౌన గీతం పాడే ఏకాంతంలో చెలికాని నానుకుని, విశ్రాంతిగా నీలి మేఘాలలోని నిండుదనం చూస్తూ కూర్చుంటే ఎంత బాగుంటుంది!"

"అమ్మా! నీ కవిత్వం బాగుంది కాని, మీ అమ్మగారికి నే చెప్తానుండు ఏ కృష్ణుడిలాంటి వాడినో పెళ్ళి కొడుకుని చూడమని...."

"అమ్మో! దక్షిణ నాయకత్వం...."

"ఐతే ప్రవరుడిలాంటి...."

"ఛ! ఊరుకో! అతని మాటెత్తకు. నాకు కోపం ప్రవరుడంటే. పాపం! వరూధిని....."

"కాదే! అతని భార్య సోమిదేవమ్మలా...."

"నేను మాత్రం—అతిథులు వేవురు కాదు కదా; టైమ్‌కాని టైమ్‌లో ఇద్దరు వచ్చినా వండి పెట్టలేను. అతిథి మర్యాదకీ, అన్నపూర్ణ బిరుదుకీ.... ఓ నమస్కారం."

*

ఆఖరి సంవత్సరం పరీక్షలవగానే శ్యామలకి పెళ్ళి సంబంధాలు చూశారు. మంచి సంబంధమే కుదిరింది. పెళ్ళికొడుకు బాగానే వున్నాడు. మంచి ఉద్యోగం. మధ్య తరగతి ఆడపిల్లలు వంక పెట్టదగ్గ లక్షణాలు ఏవీ లేవు—సంతోషంతో ఒప్పుకునే లక్షణాలే కాని....

నే నడిగాను.

"ఏం శ్యామలా! నచ్చాడా పెళ్ళికొడుకు?"

నవ్వింది కాస్త సిగ్గుగా.

"ఐతే నచ్చినట్లే నన్నమాట. ఇంతకీ ఈ పెండ్లి కొడుకుగారు ఏ శృంగార నాయకుణ్ణి పోలివున్నాడబ్బా నచ్చడానికి?"

"ఛీ! పోదూ"

తన కళ్ళలో కలల మెరుపు, బుగ్గల్లో సిగ్గు తళుకు. అప్పట్నుంచి పెళ్ళయ్యేదాకా నేను ఏదో వేళాకోళం చేస్తూనే వుండేదాన్ని. తీయని స్వప్నాలలో శ్యామల తేలిపోతూనే వుండేది.

పెళ్ళికి ముందురోజు మేమిద్దరం వాళ్ళ దాబా మీద ఒంటరిగా కూర్చున్నాం. శ్యామల అంది. "సులో ! రేపు నా జీవితం మరో మలుపు తిరగ బోతూంది. తను ఎలా వుంటా...."

మాట పూర్తి చేయడానికి సిగ్గు.

" ఊఁ! పూర్తి చేయవేం? కాబోయే శ్రీవారిని ఎలా మన్నన చేయాలో...."

" ఊరుకుందూ ! నాకెంత గాభరాగా వుందో నీకేం తెలుసు ? నాకు జీవితమంతా, అందరిలా సామాన్యంగా, అతి మామూలుగా, నిస్సారంగా గడపాలని లేదు. రోజు రోజు ఓ కొత్త అందం, ఆనందం బ్రతుకంతా నిండాలి."

" కొన్నాళ్ళకి బరువులూ, బాధ్యతలూ....?"

" ఉండనే ఉంటాయి. కాని అవే మనల్ని క్రుంగదీయ కూడదు. వెన్నెలలోని హాయిని అనుభవించడానికీ, శృంగారంలోని మాధుర్యం రుచి చూసి ఇద్దరూ ఒకటై ఆనందించడానికీ.... ఇవేవీ ఆటంకాలు కాకూడదు. ఈ జ్ఞాపకాలు మనం ముసలి వాళ్ళమైనా తల్చుకుంటే....మన పెదవుల మీద చిరునవ్వులు విచ్చుకోవాలి. మనం నిత్యం చూసే ఈ వెన్నెలే, ఈ వర్షమే, ఈ ఉదయ సాయంత్రాలే వింత వింత అందాలతో వెలిగిపోవాలి...."

"అతని సమక్షంలో...." అంటూ పూర్తి చేసి నవ్వాను.

చటుక్కున సిగ్గు పడినట్లయి, " పోదాం పద " అంది.

పెండ్లి కొడుకు వెంకట్రావు అందగాడే. అదే శ్యామలతో అంటే తృప్తిగా నవ్వింది. తర్వాత పెళ్ళి హడావుడి; వెంటనే అది కాపురానికి వెళ్ళడం, నే చదువుకి వెళ్ళడం....మేం కలుసు కుని నాలుగేళ్ళయిపోయింది.

ఎలా వుంటుందో శ్యామల యిప్పుడు? తను మంచి రస హృదయం కలది. నవ్వుతూ, నవ్విస్తూ, అలుగుతూ, మురిపిస్తూ శ్రీవారితో కలిసి వైవాహిక జీవితంలోని మాధుర్యాన్ని గ్రోలుతూ వుంటుంది. సత్యభామంటే తన కిష్టం. అంచేత, అప్పుడప్పుడు పాపం....శ్రీవారికి తల బొప్పి కట్టిస్తుంటుందేమో....

నాకు నవ్వొచ్చింది.

" ఏమిటండోయ్ మీలో మీరే నవ్వేసుకుంటు న్నారు–చేతిలో వుత్తరమేదో పట్టుకుని...."

నా కొలీగ్ లక్ష్మి లోపలికి వస్తూ అంది. శ్యామల గురించి ఆలోచనలతో కూర్చుండిపోయాను. తనని చూడాలన్న కోరిక పెరిగిపోయింది నాలో.

" ఏం లేదండి ! మా శ్యామల రమ్మని రాసింది. సెలవులేగా ! రేపే బయల్దేరి వెళ్ళాలను కుంటున్నాను."

స్టేషన్ నుంచి యింటికి రిక్షా మాట్లాడాను. నన్ను చూడగానే అత్త ఆశ్చర్యంగా అంది. "ఉత్తరం రాయలేదేం? ఇల్లు కనుక్కోటం కష్టం కాలేదుకదా !"

" లేదు. అయినా శ్యామల అడ్రస్ అదీ రాసిందిగా. సడెన్‌గా కనిపించి తనను ఆశ్చర్య పర్చాలని వుత్తరం రాయలేదు ముందుగా. మిమ్మల్నీ చూసినట్లు వుంటుందని బయలు దేరి



## మృతి
## గూల్ పవక్లా

సాంఘిక సేవకురాలిగా ప్రసిద్ధి గడించి, ప్రభుత్వం చేత ఈ సంవత్సరం 'పద్మశ్రీ'గా గౌర వింపబడిన 72 సంవత్సరాల శ్రీమతి గూల్ పవక్లా- ఇటీవల బొంబాయిలో మృతి చెందారు.

1904 లో బొంబాయిలో ఆమె జన్మించారు. చదువుకుంటున్న రోజుల దగ్గర్నుంచీ ఆమె సాంఘిక సేవ మీద ఎంతో ఆసక్తి కనబరచేవారు. 1934 లో, బొంబాయిలో వున్న 'టైమ్ అండ్ టాలెంట్స్ క్లబ్'లో జేరి, నాటకాల్లో నటిస్తూ, సాంఘిక సేవకు ధన సేకరణ చేసేవారు. ఆ విధంగా, ఆమె ఆ క్లబ్‌ను అభివృద్ధి చేశారు. ఆ క్లబ్, ఎన్నివిధాలుగానో, ఎందరికో ఇంతవరకూ 80 లక్షల రూపాయలకు పైగా ధన సహాయం అందజేసింది.

ఆమె బొంబాయిలో 'హాలీడే హోమ్' అన్న పేరిట విశ్రాంతి భవనాన్ని ఆరంభించారు. మధ్య తరగతి స్త్రీలు, పిల్లలూ, జబ్బు నుంచి కోలుకుం టున్నవారూ ఈ 'హాలీడేహోమ్'లో అతి తక్కువ ఖర్చుతో పదిహేను రోజులపాటు వుండి, విశ్రాంతి తీసుకోవచ్చును. ఆ సమయంలో అక్కడ వారి ఆరోగ్యం క్షుణ్ణంగా పరిశీలింపబడుతుంది. పుష్టికర మైన ఆహారం ఇవ్వబడుతుంది.

శ్రీమతి పవక్లా రోజు మొత్తంలో ఎక్కువసేపు సాంఘిక సేవలోనే గడిపేవారు. సేవాసదన్, రెడ్ క్రాస్ మొదలైన సంస్థలతో కూడా ఆమెకు సన్నిహిత సంబంధం వుండేది. ఉద్యోగాలు చేసే వనితలకు వీలుగా వుండేలా ఆమె ఒక 'హాస్టల్'ను కూడా స్థాపించారు.

శ్రీమతి పవక్లా ఎన్నో పుస్తకాలు కూడా రాశారు. 45 సంవత్సరాల పాటు అనేక విధాల సంఘ సేవ చేసిన, పవక్లా మృతి చెందడంతో – బొంబాయి నగరం, ఒక ప్రముఖ వనితను కోల్పోయింది !

వచ్చేశాను.''

"సరే! రా! రా! స్నానం అదీ కానియ్యి. భోజనం అదీ కానిచ్చి. మీ స్నేహితురాలిని చూద్దుగాని. అదిగో....ఆ పక్కయింట్లో మేడ మీద పోర్షనే వాళ్ళది.''

టైమ్ రాత్రి ఏడు. అత్తయ్య భోజనం పెడు తుంటే కబుర్లు చెప్తూ తింటున్నాను. మామయ్య వస్తే పలకరించి, "శ్యామలని చూసి వస్తా నత్తయ్యా'' అన్నాను.

"వాళ్ళ శ్యామల కోసం వచ్చింది కాని మన మీద అభిమానం కొద్దీ వచ్చిందేమిటి?'' మామయ్య సరదాగా నవ్వుతూ అంటున్నాడు. "నీకు సమాధానం తరవాత చెప్తానులే!'' అంటూనే శ్యామల ఇంటి వేపు నడిచేను.

పౌర్ణమి కాబోలు. వెన్నెల వెండి పూత పూస్తోంది. చల్లగా వుంది వాతావరణం. మెట్లకి ఆ వైపున సన్నజాజి పందిరి. ఉండి వుండి పిల్లగాలులు పూల పరిమళాన్ని మోసుకొచ్చి మనసును మత్తెకిస్తున్నాయి. రేడియోలో ఏదో వాద్య సంగీతం. శ్యామల సంగతి నాకు తెలుసు. ఈ పండు వెన్నెల్లో, ఈ పూల పరిమళంలో దాని మనసు కొత్త అందాలను వెతుక్కుంటూ రెక్కలు విప్పుకుని సాగిపోతుంది.

ఇప్పుడు ఏ స్థితిలో వుంటుందో! శ్రీవారి ఒడిలో సరసాల మురిపాలలో తేలుతూ వుంటుం దేమో! నే వెళ్ళదం ఉచితమా యిప్పుడు? నాలుగైదు మెట్లు ఎక్కవలసి వుంది. శ్యామల గొంతు....చటుక్కున ఆగాను.

"వంటిల్లు సర్దివచ్చేలోగానే నిద్రపట్టేసిందా?'' గట్టిగా అంటోంది.

'ఆ(....' బద్ధకంగా అతని స్వరం.

"ఐనా, కాస్త చల్లగాలిలో ఆరుబయట కూర్చుంటే చాలు, ఒక్క నిమిషంలో వచ్చేస్తుంది మీకు నిద్ర. అలవాటేగా, ఇక లోపలకుపోయి పడక వెయ్యండి.''

"ఆ....సరే....కుర్చీ నువు తెస్తావుగా?''

"ఊ....అన్నట్లు చెప్పటం మర్చిపోయాను. ఈ వేళ చింతపండు వాడొచ్చాడు. ఆరు కేజీలు మొత్తంగా తీసుకుంటే కాస్త ధర తగ్గిస్తానన్నాడు. మనకంత కావాలా అని....''

అంతే! శ్యామలదీ మామూలు జీవితమే!

నేనింక మెట్లెక్కే స్థితిలో లేను. □

## గోష్ఠి

మద్రాసులోని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ వారు–పొట్టి శ్రీరాములు స్మారక మందిరంలో— 'సాహిత్యం - స్త్రీ సమస్యలు' అన్న విషయంపై గోష్ఠిని ఏర్పాటు చేశారు. ఈ గోష్ఠిలో శ్రీమతులు 'హజరా,' కె. సుకన్యాదేవి, డాక్టర్ ఎ. విజయ లక్ష్మి, తుమ్మలపల్లి కవిత, శ్రీయుతులు మహీధర రామమోహనరావు, బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు, చామర్తి దుర్గాప్రసాద్, పి. సూర్యమోహన్‌ల రచనలు చదవడం, కొన్ని ప్రధానమైన అంశాలపై సభికులు చర్చించడం జరిగింది. ఆడపిల్ల పెళ్ళి చేసుకుంటున్నప్పుడే 'ఎన్నాళ్ళుంటుందో ఈ వైవాహిక జీవితం' అని అనుమానించే పరిస్థితులు ఈనాడు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అటువంటి పరిస్థితుల్లో ఉన్నామా మనం – అని ఆలోచించుకుంటూవుంటే సిగ్గుచేటుగా వుంది. స్త్రీల సమస్యలను ఆలోచించకుండా స్త్రీని చౌక బారు వస్తువుగా వూహించడం ఈనాడు ఎక్కువగా జరుగుతోంది. ఈ దుస్థితిని తొలగించడానికి రచయితలు, రచయిత్రులు కృషిచేయాలన్నారు శ్రీమతి 'హజరా'. "అసహజ వాతావర ణాన్ని, అవాస్తవిక సంఘటనలను సృష్టించి, పాఠకులను స్వప్నలోకాలలో విహరింపజేసే రచనలవల్ల ప్రయోజనం లేదనీ, సామాన్య ప్రజానీకంలో స్త్రీ పురుషులు ఎదుర్కొంటున్న సమస్యలను కథా వస్తువులుగా తీసుకుని, ఆ సమస్య లకు పరిష్కారాన్ని సూచిస్తూ, సమాజ పురోభి వృద్ధికి దోహదం చేసే రచనలు రావాలి'' అని శ్రీమతి సుకన్యాదేవి చెప్పారు. "ఈనాడు వస్తున్న కథలలో ఎక్కువగా భార్యా భర్తల మధ్య అపో హలు రావడం, తన భర్త ఎన్ని నేరాలు చేసినా భార్య వాటిని ఓపికగా క్షమించేయడం, చివరికి 'నీ మంచితనానికి, పాతివ్రత్యానికి, ఔదార్యానికి నేనే దాసోహమంటున్నాను' అని భర్తచే పలికించడం, భార్యామణి ఆనందాతిశయంలో 'మీరే నా ప్రత్యక్ష దైవం' అనడం జరుగు తోంది. దీన్నిబట్టి చూస్తుంటే స్త్రీలకు ఆత్మ గౌరవం వుండదా? అని అనిపిస్తుంది. ఇటీవల ఒక ప్రముఖ వార పత్రికలో ఓ నవల సీరియల్‌గా ప్రచురింపబడింది. ఆ నవలలో పాతివ్రత్యపు విలువలు అంటూ స్త్రీలను బానిసలుగా వంటింటి కుందేళ్ళుగా రూపొందించడానికి ప్రయత్నం చేయడం, హిందూ సంస్కృతి పునరుద్ధరణ పేరుతో–నేటి ఆధునిక స్త్రీలను నీచంగా చిత్రీకరించడం జరిగింది. సాహిత్యంలో ఇటువంటి ధోరణులు అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. భారతీయ సంస్కృతిలోను, వ్యవస్థలోను జీర్ణించుకుపోయిన మూర్ఖత్వానికి పాతివ్రత్యపు విలువల ముసుగు వేయడం మానుకున్ననాడే మనం ప్రగతి పథం వైపు పయనించగలం'' అన్నారు తుమ్మలపల్లి కవిత. స్త్రీలలో ప్రపంచాన్ని అర్థం చేసుకోగల జ్ఞానం, అన్యాయాలకు ఎదురుతిరిగి బ్రతకగల ధైర్యం, తెగింపు, ఆత్మ విశ్వాసం కలగడానికి దోహదం చేసే రచనలు ఈనాడు చాలా అవసరమన్నారు డాక్టర్ ఎ. విజయలక్ష్మి తమ ప్రసంగ వ్యాసంలో. "జీవ పరిణామక్రమంలో వచ్చిన శారీరక ప్రత్యేకతలూ, మానసిక ప్రవృత్తులూ, సమాజ పరిణామక్రమంలో వచ్చిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ ప్రతిపత్తులూ స్త్రీలను అనేక హద్దుల్లో పెడుతున్నాయి. అనేక సమస్యలకు గురి చేస్తున్నాయి. రచయితలు – తమ రచనల్లో సమ స్యలకు పరిష్కారం చూపి తీరాలనే నిర్బంధం ఏమీ లేదు. జరుగుతున్న ఘటనల వాస్తవిక, అవాస్తవికతాజ్ఞానం చూసేవారి మానసిక ప్రవృత్తి మీద ఆధారపడి వుంటుంది. అందుచేత సమస్యా పరిష్కారంకన్న, ఆ సమస్య గురించి రచయితకు వున్న అభిప్రాయం, వివేచనా జ్ఞానం, చిత్రణ శక్తి ప్రాముఖ్యం వహిస్తాయి'' అన్నారు శ్రీ మహీ ధర రామమోహనరావు. "స్త్రీకి విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం, పురుషునితో సమానత్వం అవసర మనీ, అవి వున్నప్పుడే స్త్రీలు కూడా పురుషులతో పాటు సమాజ ప్రగతికి దోహదం చేస్తారని మన స్ఫూర్తిగా నమ్మనివాళ్ళు ఇంకా, యీనాటికీ వున్నా రంటే మన సమాజం ఎంత వెనకబడివుందో తెలుస్తోంది. సమాజ ప్రగతికి తోడ్పడవలసిన రచ యిత్రులు చాలామంది 'భర్తచాటున బ్రతకడమే స్త్రీకి పరమార్థం' అని భావించడం చాలా విచార కరం" అన్నారు శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు. ఆర్థిక అసమానతలు తొలగిననాడు సమాజంలో ప్రధానమైన సమస్యలు ఏవీ వుండవని–తమ తమ వ్యాసాల్లో వివరించారు శ్రీయుతులు చామర్తి దుర్గాప్రసాద్, పి. సూర్యమోహన్.

అనంతరం ఈ అంశాలపై ఇష్టాగోష్ఠి జరిగింది.

—విలేకరి